న్యూస్‌రీల్

'ఓపెన్' తరగతులకు హాజరవ్వాలి



తరగతులకు హాజరైన అభ్యాసకులు

దండేపల్లి: సెలవు రోజుల్లో నిర్వహించే ఓపెన్ పది తరగతులకు అభ్యాసకులు తప్పక హాజవ్వాలని దండేపల్లి ఓపెన్‌స్కూల్ సహాయ కో ఆర్డినేటర్ రాజేశ్వర్‌రావు అన్నారు. మధ్యలో చదువు మానేసిన వారికి ఓపెన్ స్కూల్ ఓ వరం లాంటిదని, విద్యాసంవత్సరంలో నిర్వహించే 30తరగతులకు అభ్యాసకులు హాజరవ్వాలని సూచించారు.

బ్రహ్మోత్సవ ఏర్పాట్లు షురూ

దండేపల్లి: మండలంలోని గూడెం శ్రీ సత్య నారాయణస్వామి ఆలయంలో ఈ నెల 30నుంచి ఫిబ్రవరి 6వరకు స్వామివారి వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు. బ్రహ్మోత్సవ ఏర్పాట్లలో భాగంగా ఆదివారం ఆలయానికి రంగులు వేయడం ప్రారంభించారు.

బంద్ సంపూర్ణం



మూసి ఉన్న దుకాణాలు

లక్సెట్టిపేట: ఐక్యవ్యాపార సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన దుకాణాల బంద్ సంపూర్ణంగా కొనసాగింది. ముకుమ్మడిగా సాగిన బంద్‌లో వ్యాపారస్తులు పాల్గొని దుకాణాలను బంద్ చేశారు. వ్యాపారస్తులపై దాడులను నిరసిస్తూ ఇక ముందు ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. పోలీసులు ఎలాంటి సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తగా బందోబస్తు నిర్వహించారు.


బీఆర్ఎస్ సోషల్ మీడియా ఆత్మీయ సమ్మేళనం



మాట్లాడుతున్న రాజ్‌కుమార్

భీమారం: మండలంలోని అంకుసాపూర్‌లో ప్రభుత్వ విప్ బాల్క సుమన్ ఆదేశాల మేరకు గ్రామాల పరిధిలో ఆదివారం బీఆర్ఎస్ సోషల్ మీడియా ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఇందులో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కలగూర రాజ్‌కుమార్ మాట్లాడారు. కార్యకర్తలంతా పార్టీ బలోపేతానికి కృషి చేసి, ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర వికాస సమితి ఉపాధ్యక్షుడు విజయానంద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు



మంచిర్యాల	
శ్రీనివాస	: వాల్తేరు వీరయ్య
వెంకటేశ్వర	: వీరసింహారెడ్డి
జెమిని సినిమా స్క్రీన్ 1	: వాల్తేరు వీరయ్య/ ధమాక
జెమిని సినిమా స్క్రీన్ 2	: వీరసింహారెడ్డి/ వారసుడు
లక్సెట్టిపేట	
మహానంద	: వాల్తేరు వీరయ్య
జన్నారం	
రాఘవేంద్ర	: వాల్తేరు వీరయ్య
చెన్నూర్	
శ్రీశ్రీనివాస	: వాల్తేరు వీరయ్య
బెల్లంపల్లి	
రామకృష్ణ	: వీరసింహారెడ్డి
బాలాజీ	: వారసుడు
సీసీసీ	
దేవి	: వీరసింహారెడ్డి
తిరుమల	: వాల్తేరు వీరయ్య

- మంచిర్యాలటౌన్



బుధకలాన్ శివారులో అలంకారప్రాయంగా క్రీడా ప్రాంగణం

ఆటలకు చోటేది?

- నత్తనడకన క్రీడా ప్రాంగణ నిర్మాణ పనులు
- బోర్డుల ఏర్పాటుతోనే సరి
- వృథా అవుతున్న లక్షల నిధులు
- పలు జీపీల్లో స్థలం లేక ప్రారంభం కాని పనులు

బెల్లంపల్లిరూరల్: గ్రామీణులకు ఆటలతో పాటు ఆహ్లాదాన్ని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తెలంగాణ క్రీడా ప్రాంగణాలు గ్రామీణులకు అందనిద్రాక్షలా మారాయి. ప్రభుత్వం లక్షల రూపాయలు వెచ్చించి ప్రతీ గ్రామానికి క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేసి యువతకు క్రీడల్లో ప్రావిణ్యం అందించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో వారు రాణించేందుకు ప్రత్యేక కృషి చేస్తున్నా... అది క్షేత్రస్థాయిలో మాత్రం కార్యరూపం దాల్చడం లేదు. క్రీడా ప్రాంగణాలు అనుకున్న మేర నిర్మాణాలు జరగకపోవడంతో ఆ ప్రాంగణాల్లో ఆటలు ఎప్పటికీ సాగేనో అనే అనుమానాలు తలెత్తుతున్నాయి.

బెల్లంపల్లి మండల పరిధిలో....

బెల్లంపల్లి మండల పరిధిలో 17గ్రామ పంచాయతీలు ఉండగా.. వీటి పరిధిలో 16హ్యాబిటేషన్ గ్రామాలు ఉన్నాయి. మండల వ్యాప్తంగా మొత్తంగా 33తెలంగాణ క్రీడా ప్రాంగణాలు నిర్మాణాలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తొలుత క్రీడా ప్రాంగణాల నిర్మాణాల కోసం గ్రామ పంచాయతీ పాలక వర్గం, అధికారులు ఆసక్తి చూపినా క్రమేనా ఆ ఆసక్తి కాస్త సన్నగిల్లుతూ వచ్చింది. దీంతో 33క్రీడా ప్రాంగణాల్లో ఇప్పటి వరకు దాదాపు 17నిర్మాణాలు మాత్రమే అరకొర వసతులతో పూర్తయ్యాయి. ఇంకా 16క్రీడా ప్రాంగణాల నిర్మాణాలు పూర్తి కావాల్సి ఉంది.

అరకొర వసతులతోనే....

క్రీడా ప్రాంగణంలో క్రీడాకారులకు అణువుగా ఉండే విధంగా రాష్ట్ర ప్రభుత్వం పలు వసతులతో కూడిన నిర్మాణాలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది. అందుకు అనుగుణంగా క్రీడా ప్రాంగణంలో స్వాగత బోర్డు, వాలీబాల్ కోర్టు, కబడ్డీ కోర్టు, ఖో-ఖో, లాంగ్ జంప్, ఇతర ఆటలు ఆడేందుకు అనుకూలంగా ఉండేలా ప్రాంగణాల్లో వసతులు కల్పించాల్సి ఉంది. దీంతో పాటు వాకింగ్ ట్రాక్, వ్యాయామం చేసుకునేందుకు అవసరమైన సామగ్రి, ఇతర ఏర్పాట్లు చేయాలి. కానీ ఇవేమి ఇక్కడ కనిపించడం లేదు. నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఒత్తిడి తేవడంతో కేవలం స్వాగత బోర్డులు ఏర్పాటు చేసి వాలీబాల్, ఖో-ఖో పోల్స్ అమర్చి మమా అనిపించారు. కన్నాల గ్రామ పంచాయతీ పరిధిలోని కన్నాల, ఎస్సీ కాలనీ, లక్ష్మీపూర్ గ్రామాలకు కేటాయించిన క్రీడా ప్రాంగణాలను ఒకే చోట ఏర్పాటు చేశారు. పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు గ్రామాలకు దూరంగా సరైన దారి లేకుండా ఉన్నాయి. దీంతో అవి ఎవరికి ఉపయోగపడకుండా నిరుపయోగంగా మిగిలిపోయే అవకాశాలున్నాయి.

లక్షల నిధులు వెచ్చించినా...

క్రీడా ప్రాంగణ నిర్మాణానికి రూ.లక్షల నిధులు వెచ్చించినా అవి గ్రామీణుల ఆటలకు ఏమాత్రం ఉపయోగపడి వినియోగంలోకి వస్తాయో అనే సందేహాలు గ్రామీణుల్లో నెలకొంది. ఒక ఎకరం స్థలంలో క్రీడా ప్రాంగణ నిర్మాణానికి రూ.4లక్షల నిధులు, అర ఎకరం స్థలంలో నిర్మాణానికి రూ.2లక్షల నిధులు ఈజీఎస్ ద్వారా ప్రభుత్వం మంజూరు చేస్తోంది. వీటి నిర్మాణం కోసం మండల పరిధిలో దాదాపు రూ.కోటి రూపాయల నిధులు వెచ్చించింది. లక్షల రూపాయాలు నిధులు వెచ్చించినా ప్రభుత్వం కేటాయించిన లక్ష్యం చేరుకునేలా లేదు. ఈ అరకొర పనులతో లక్షల రూపాయలు నిధులు వృథా అయ్యే అవకాశం ఉండడంతో స్థానికుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామాల్లో ప్రభుత్వ స్థలం అందుబాటులో లేకపోవడం వల్లనే క్రీడా ప్రాంగణాల నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదని అధికార యంత్రాంగం పేర్కొంటోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి క్రీడా ప్రాంగణాల నిర్మాణాలు పూర్తి చేసి వాటిని వినియోగంలోకి తీసుకురావాలని గ్రామీణులు, యువత కోరుతోంది.

భూ సమస్యతోనే నిర్మాణాలు జరగడం లేదు



మండల పరిధిలోని గ్రామాల్లో ప్రభుత్వ భూమి కేటాయింపు సమస్య ఉంది. ప్రభుత్వం కేటాయించిన స్థలంలో రెవెన్యూ, అటవీ శాఖ మధ్య వివాదం తలెత్తడంతో నిర్మాణాలు చేపట్టలేకపోతున్నాం. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరితగతిన సమస్య పరిష్కరించి గడువులోగా నిర్మాణాలు పూర్తి చేసేందుకు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నాం. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టకపోతే శాఖపరమైన చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నాం. పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదు.

- డి.రాజేందర్, ఎంపీడీవో బెల్లంపల్లి

గిరిజనుల అభివృద్ధికి కృషి

- బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య



కోలాంగూడలో ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

కాసిపేట: గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. మండలంలోని వెంకటాపూర్ పంచాయతీ కుర్రేఘాట్‌లో ఆదివారం కూపర్‌లింగుస్వామి జాతర రెండో రోజు నిర్వహించిన కార్యక్రమాలకు హాజరై దర్శనం చేసుకొని పూజలు చేశారు. ఆదివాసీ గిరిజనులు సాంప్రదాయ పద్ధతిలో ఘనంగా స్వాగతం పలికారు. కుర్రేఘాట్ రోడ్డు నిర్మాణానికి రూ.1.02 కోట్లు మంజూరుకు కృషి చేస్తానని, ఆలయం వద్ద రేకుల షెడ్, మరుగుదొడ్ల కోసం రూ.10 లక్షలు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. కోలాంగూడలో పది మంది గిరిజనులకు ఐటీడీఏ ద్వారా ఒక్కొక్కరికి రూ.3లక్షల చొప్పున మంజూరైన ఇళ్ల నిర్మాణాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. వెంకటాపూర్ పంచాయతీ తెలంగాణ క్రీడాప్రాంగణాన్ని ప్రారంభించారు. మల్కెపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త ఆడ సోము ఇటీవల ప్రమాదంలో మృతిచెందగా ఇన్సూరెన్స్ చెక్కు రూ.2లక్షలు అందజేశారు. రొట్టపల్లి గ్రామానికి చెందిన పోగుల శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు బీఆర్ఎస్ ఇన్సూరెన్స్ చెక్కు రూ.2లక్షలు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చంద్రయ్య, వైస్ ఎంపీపీ విక్రమ్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమణరెడ్డి, సర్పంచ్‌లు సౌందర్య, జంగు, లక్ష్మి, తిరుపతిరెడ్డి, దుర్గం పోశం, హన్మంత్, మంజులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పవర్‌కట్ ప్రాంతాలు



దండేపల్లి: లక్సెట్టిపేట, జన్నారం, దండేపల్లి మండలాల్లో సోమవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు లక్సెట్టిపేట విద్యుత్ ఏడీఈ ప్రభాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 33కేవీ కొత్తలైన్ ఏర్పాటులో భాగంగా సరఫరా నిలిపి వేయనున్నట్లు విద్యుత్ వినియోగ దారులు గమనించాలన్నారు.

నూతన అధ్యక్షుడికి సన్మానం

మందమర్రిరూరల్: బీఆర్ఎస్ మందమర్రి పట్టణ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన రవీందర్‌ను పార్టీ శ్రేణులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ.. కష్టపడిన వారికి అధిష్టానం గుర్తింపునిస్తుందని, పార్టీ అభివృద్ధి కోసం కృషిచేస్తానన్నారు.

నూటికి నూరు శాతం లక్ష్యంగా..



మంచిర్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు

- ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- ద్వితీయ సంవత్సర విద్యార్థులకు ఎంసెట్ కోచింగ్

మంచిర్యాలఅర్బన్: ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడంపై అధికారులు దృష్టిపెట్టారు. ఇప్పటికే సిలబస్ పూర్తి కావడంతో ఉన్నతాధికారులు రివిజన్, పాఠ్యాంశాలపై విద్యార్థులు పట్టు సాధించేలా ప్రణాళిక సిద్ధం చేశారు. మార్చి 15నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈలోగా వెనుకబడిన విద్యార్థులు కూడా సబ్జెక్టుల్లో పట్టు సాధించేలా ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఈ మేరకు విద్యార్థులకు సాయంత్రం 4 నుంచి 5గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా..



ఇంటర్మీడియట్‌లో వందశాతం ఫలితాలే లక్ష్యంగా పనిచేస్తున్నాం. కళాశాలలో విధులు నిర్వహించే అధ్యాపకులు ప్రత్యేకంగా ప్రిపరేషన్‌తో క్లాస్ నిర్వహిస్తున్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు స్టడీ అవర్స్, ద్వితీయ సంవత్సరం విద్యార్థుల కోసం ఎంసెట్ శిక్షణ ఇస్తున్నాం. విద్యార్థులకు కావాల్సినంత సమాచారం అందుతుంది.

- రవికుమార్, ప్రిన్సిపాల్, మంచిర్యాల ప్రభుత్వ కళాశాల

ఉచితంగా ఎంసెట్ కోచింగ్..

ఎంసెట్‌లో ప్రభుత్వ కళాశాల విద్యార్థులు కూడా ఉత్తమ ర్యాంకులు సాధించేలా ఇంటర్ సెకండియర్ సైన్స్ విద్యార్థులకు ఉచిత ఎంసెట్ కోచింగ్ నిర్వహిస్తున్నారు. పరీక్షలకు సమయం దగ్గర పడుతుండడంతో ప్రత్యేక ప్రణాళికతో విద్యార్థులు సన్నద్ధమవుతున్నారు. సమయం వృథా చేయకుండా విద్యార్థులు ప్రత్యేక తరగతులను సద్వినియోగం చేసుకుంటున్నారు.

ప్రణాళికతో ముందుకు..



నేను మంచిర్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బైపీసీ సెకండియర్ చదువుతున్నాను. పరీక్షల కోసం ప్రణాళికతో ముందుకుసాగుతున్నా. కళాశాలలో నిర్వహించే ప్రత్యేక తరగతులకు హాజరవుతున్నా. తెలియని విషయాలను అధ్యాపకుల ద్వారా నివృత్తి చేసుకుంటున్నాను. డాక్టర్ కావాలనే లక్ష్యంతో ఎంసెట్ తరగతులను ఉపయోగించుకుంటున్నా.

- మల్లేశ్వరి, బైపీసీ సెకండియర్

పేద విద్యార్థులకు ఉపయోగం



నేను ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న. ఫీజులు కట్టి ట్యూషన్‌కు వెళ్లలేని వారికి సాయంత్రం 4 నుంచి 5గంటల వరకు ఎంసెట్ ప్రత్యేక తరగతులు చాలా ఉపయోగపడుతున్నాయి. బేసిక్ నేర్చుకుని క్లాస్‌ల సమయంలో ఎగ్జామ్ హాల్‌లో ఇచ్చిన ప్రశ్నలు, విశ్లేషణలు చేసి జవాబులు చేయగల్గుతున్నాం. మధ్యాహ్నం భోజనం అమలు చేస్తే బాగుంటుంది.

- ఠాకూర్ ప్రవళిక

వెటర్నరీ డాక్టర్ కావటమే లక్ష్యం



ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం బైపీసీ చదువుతున్న. వార్షిక పరీక్షల్లో ప్రథమ శ్రేణి మార్కులు సాధించాలనే సంకల్పంతో కష్టపడుతున్న. ప్రత్యేక టైం టేబుల్ ఏర్పాటు చేసుకుని ముందకు సాగుతున్న. ఇంటర్ ఎంసెట్‌లో మంచిమార్కులు సాధించి వెటర్నటీ డాక్టర్ అవుతాను.

- సాయి సంజన

వార్డులో పర్యటించి.. సమస్యలు ఆలకించి



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని 1వ వార్డు రాజీవ్‌నగర్‌లో ఆదివారం ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు పర్యటించి, ప్రజలను సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఇంటింటికీ సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరిస్తూనే, వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని, వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారు. వార్డును అభివృద్ధి పర్చేందుకు అవసరమైన పనులను గుర్తించి, అందుకు సరిపడా నిధులను కేటాయిస్తామని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, వార్డు కౌన్సిలర్ బుద్దార్థి సత్తమ్మ, పీఏసీఎస్ చైర్మన్ సందెల వెంకటేశ్, బుద్దార్థి రాంచందర్, నాయకులు పాల్గొన్నారు.

అవినీతి పాలనకు చరమగీతం పాడుదాం

- మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్



మురిమడుగులో పర్యటిస్తున్న మాజీ ఎంపీ

జన్నారం: రాష్ట్రంలో పెరుగుతున్న అవినీతి పాలనకు చరమగీతం పాడాలని మాజీ ఎంపీ, బీజేపీ నేత రాథోడ్ రమేశ్ అన్నారు. మండలంలోని మురిమడుగు, ఇందన్‌పల్లి గ్రామాల్లో 'ప్రజాగోస-బీజేపీ భరోసా' కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ఇంటింటికీ తిరుగుతూ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అవినీతి, అక్రమాలను, ప్రధాని నరేంద్రమోడీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. ప్రతి గడపకూ వెళ్లి పలుకరిస్తూ రానున్న ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తేవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు బద్రినాయక్, బీజేపీ నాయకులు ఉట్కూరి శ్రీనివాస్‌రెడ్డి, మహేశ్, వంగపల్లి సురేశ్, నల్లపు కృష్ణ, మల్లేశ్, రాయమల్లు తదితరులు పాల్గొన్నారు.

మహాసభలు విజయవంతం చేయండి

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలో ఈ మార్చి 25, 26న నిర్వహించే భారత కార్మిక సంఘాల తెలంగాణ రాష్ట్ర 9వ మహాసభలను విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మహాసభల విజయవంతానికి ఆదివారం రాష్ట్ర కమిటి అధ్యక్షుడు శ్రీనివాస్ అధ్యక్షతన ఆహ్వాన కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో నిర్వహించబడే 9వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం ఆహ్వాన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కే.నారాయణ, అధ్యక్షుడిగా ఎండీ మునీర్, ప్రధాన కార్యదర్శిగా గురాజాల రవీందర్‌రావ్, కోశాధికారిగా టీ.శ్రీనివాస్, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులతో పాటు 250మంది ఆహ్వాన కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.జనార్దన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు చాంద్ పాష, అందే మంగ, శ్రీకాంత్, మల్లన్న, చరణ్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

వాసవి అమ్మవారి దీక్ష



అమ్మవారి దీక్షను స్వీకరించిన వాసవి క్లబ్ సభ్యులు

మంచిర్యాలటౌన్: ఆర్యవైశ్యుల కులదేవత శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం వాసవి క్లబ్ సభ్యులు అమ్మవారి భక్తులు ఒక్కరోజు మాల దీక్ష స్వీకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. కన్యకా పరమేశ్వరి ఆలయం అర్చకులు బాలకృష్ణ శర్మ చేతుల మీదుగా మాల స్వీకరణ చేపట్టారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ గవర్నర్ కొండ చంద్రశేఖర్, రీజియన్ సెక్రటరీ అక్కెనపల్లి రవీందర్, జోన్ చైర్మన్ కోశెట్టి వంశీకృష్ణ, సిద్ధంశెట్టి మధు, చిలువేరు శ్రీనివాస్, వాసవి క్లబ్ అధ్యక్షుడు నలుమాసు ప్రవీణ్, కోశాధికారి చిలువేరు మహేశ్, అయిత శ్రీనివాస్, చిటుమల్ల శ్రీనివాస్, కోశాధికారి కొడిత్యాల రాజేంద్రప్రసాద్, సాయి వర్ధన్, హేమంత్ పాల్గొన్నారు.

వేలాల గుట్ట రోడ్డుకు మహర్దశ



వేలాల గుట్టపైకి నూతనంగా నిర్మించిన బీటీ రోడ్డు

- తీరనున్న భక్తుల కష్టాలు

జైపూర్: మండలంలోని వేలాల గుట్ట వెళ్లే రోడ్డుకు మహర్దశ వచ్చింది. జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన శైవక్షేత్రం కావడం, ఏటా మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా వైభవంగా జాతర జరుగుతుండడంతో తెలంగాణ రాష్ట్రంతో పాటు మహారాష్ట్ర నుంచి వేలాదిగా భక్తులు తరలివస్తారు. మూడు రోజుల పాటు జరుగుతుండగా భక్తులు రవాణాకు ఇబ్బందులు పడేవారు. ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ చొరువతో వేలాల గుట్టపైకి వెళ్లే రోడ్డు నిర్మిస్తుండడంతో భక్తులకు కొంతమేరకు రవాణా ఇబ్బందులు తొలిగిపోనున్నాయి. గతేడాది దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డితో కలిసి బాల్క సుమన్ రూ.2.20కోట్లతో వేలాల గుట్టపైకి వెళ్లే కమాన్ నుంచి రెండు కిలోమీటర్లు బీటీ రోడ్డుకి శంఖుస్థాపన చేశారు. గుట్టపైకి వెళ్లే ఆర్చీ నుంచి రెండు కిలో మీటర్లు బీటీ రోడ్డు పూర్తయింది. అక్కడి నుంచి గుట్టపైకి వెళ్లడానికి 700మీటర్ల సీసీ రోడ్డు నిర్మిస్తున్నారు. వచ్చే నెల 18న మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జాతర సాగనుండగా జాతర వరకు పనులు ముగిసేలా ముమ్మరంగా పనులు చేస్తున్నారు.

అటెన్షన్ ప్లీజ్..

నీరు నిల్వకుండా చూడండి..!



బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మండలం పెర్కపల్లి గ్రామపంచాయతీలోని ఓ వీధిలో రోడ్డు పై మురుగు నీరు నిల్వ ఉండి పారిశుధ్యం లోపిస్తోంది. దీంతో దోమల బెడద పెరిగుతోంది. మురుగునీరు నిల్వ ఉండటంతో రోడ్డుపై ప్రజలు రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకుని, రోడ్డుపై ప్రవహించకుండా తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సంబంధిత అధికారి: శ్రీనివాస్, ఎంపీవో
ఫోన్ నంబర్: 98487 33813

ఆత్మీయ సభకు నేతకానీలు

వేమనపల్లి: మండలంలోని అన్ని గ్రామాల నుంచి ఆదివారం రామగుండంలో నిర్వహించిన నేతకాని మహా ఆత్మీయ సమ్మేళనానికి మండల నాయకులు కుడకల శ్రీనివాస్, ఎన్నం కిరణ్ ఆధ్వర్యంలో సభకు తరలివెళ్లారు.